# మంచికి వంచెన

సంవత్సరం 1979, జూన్ మాసం. తెల్లవారుఝామున ఐదుగంటల సమయం. డెహరాడూన్‌లోని ఎత్తువల్లాల రోడ్లమీద, అక్కడో మనిషి ఇక్కడో మనిషి చలి దుస్తుల్లో తమ తమ పనులమీద వెళ్తూ కన్పిస్తున్నారు. ఒక మిలటరీ జీపు జన సంచారం తక్కువగా వున్న రోడ్డుమీద వేగంగా పోతున్నది. అది యంగ్ బజారురో వున్న కెప్టెన్ ఎస్. ఎన్. సింగ్ ఇంటి ముందు ఆగింది.

డ్రైవర్ బుద్ధరాం హారన్ కొట్టాడు. అప్పటికి ఐదున్నర అయింది. పదిహేను నిముషాలు గడిచాయి. సింగ్ బయటికి రాలేదు. ఇంటి తలుపు తెరవలేదు. బుద్ధరాంతో పాటు జీపులో అతని స్నేహితుడు మోహన్ సింగ్ కూడా ఉన్నాడు. బుద్ధరాం జీపు దిగి, లాన్‌దాటి, ఇంటి ముందుకు వెళ్ళాడు. ఇంటి తలుపులు ఓరగా తెరచి వున్నాయ్. డ్రైవర్ తలుపు తట్టాలా లేదా అన్న ఆలోచనలో పడ్డాడు. ఇంతలో ఇంట్లోంచి "గూఁ ఊఁ గూఁ" అంటూ వింత శబ్దం వినిపించింది. డ్రైవర్ తన స్నేహితుడ్ని పిల్చాడు. ఇద్దరూ లోపల ప్రవేశించారు. శబ్దం వస్తున్న గదిలోకి వెళ్ళారు. అది బెడ్‌రూం. కిటికీ చువ్వలకు సింగ్ భార్య రాగిణి చేతులు కొబ్బరి తాడుతో కట్టబడి ఉన్నాయి. ఆమె నోటికి గుడ్డకట్టి వున్నది. ఆమె నోటినుంచి మాట రానందువల్ల "గూఁ ఊఁ" అంటూ శబ్దం చేస్తున్నది. డ్రైవరూ అతని స్నేహితుడూ ఆమె చేతులకు

కట్టివున్న తాళ్ళు ఊడదీశారు. మూతికి కట్టివున్న వస్త్రాన్ని ఆమే స్వయంగా లాగేసుకున్నది. డ్రైవర్ ''అమ్మగారు! ఏమైంది? ఎవరిలా చేశారు?'' అని అడిగాడు. కాని రాగిణి సమాధానం చెప్పలేదు. బెడ్ మీద తలపట్టుకొని కూర్చున్నది. డ్రైవర్ సింగ్ బెడ్‌రూం దగ్గరకు వెళ్ళాడు. తలుపులు బార్లగా తెరచి ఉన్నాయి. సింగ్ బెడ్‌మీద అస్త వ్యస్తంగా పడివున్నాడు. బెడ్ రక్తంతో తడిచి ఉన్నది. డ్రైవరూ, అతని స్నేహితుడూ చూడగానే "కెవ్వు"న అరిచారు. ఎంతోసేపు కళ్ళు అప్పగించి చూస్తూ వుండిపోయారు. డ్రైవర్ రాగిణి బెడ్‌రూంలోకి వెళ్లి సింగ్ హత్య గురించి చెప్పాడు. రాగిణి విని ఊరుకున్నది. ఆమె మౌనం డ్రైవర్‌కు అమితమైన ఆశ్చర్యాని కలిగించింది.

డ్రైవర్ వెళ్లి ఇరుగు పొరుగు మిలటరీ ఆఫీసర్లకు కెప్టెన్ సింగ్ హత్య గురించి తెలియజేశాడు. నిముషాల్లో అనేకమంది సింగ్ ఇంటికి వచ్చారు. సింగ్‌ను హత్య చెయ్యడానికి కారణాలు ఎవరికీ అంతుపట్టడం లేదు. సింగ్ చాలా మంచివాడు. అతనికి శతృవులంటూ లేరు. సింగ్ హత్య గురించి పోలీసు సూపరింటెండెంటుకు తెలియపర్చారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ యాదవ్ తన సిబ్బందితో హత్య జరిగిన ఇంటికి చేరాడు.

సింగ్ మెడమీద నాలుగైదు కత్తిపోట్లు వున్నాయ్. బెడ్‌మీద నేలమీద రక్తం గడ్డగట్టిన మరకలున్నయ్. ఫొటోలు తీశారు. శవాన్ని వైద్య పరీక్ష నిమిత్తం పంపించారు. ఆ తర్వాత ఎంక్వయిరీ మొదలు పెట్టారు పోలీసులు.

ఆ రాత్రి ఇంట్లో ఉన్నవాళ్లు సింగ్, సింగ్ భార్య రాగిణి మాత్రమే. అందుకే ముందుగా రాగిణిని ప్రశ్నించాడు.

రాగిణి ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో "సింగ్ బాగా తాగి, రాత్రి ప్రొద్దుపోయి ఇంటికి చేరుకున్నాడు. ఆయన నిద్రపోయాక రాగిణి తన

బెడ్‌రూంలోకి వచ్చింది. మంచి నిద్రలో వుండగా ముగ్గురు వ్యక్తులు ఆమె గదిలో ప్రవేశించారు. ఆమె చేతులు కట్టారు. అరవకుండా నోటికి గుడ్డ బిగించారు. అందులో ఒకడు రివాల్వరు చూపిస్తూ ఆమె దగ్గరే నిల్చున్నాడు. మిగతా ఇద్దరూ సింగ్ బెడ్‌రూంలోకి వెళ్ళారు. ఆయనను చంపి, ఇంట్లోవున్న నగలు తీసుకుని వెళ్ళారు. వెళ్తూ వెళ్తూ రాగిణితో "మా ప్రతీకారం తీర్చుకున్నాం!'' 'అని అన్నారు'' అనివుంది.

ఇన్‌స్పెక్టర్ సింగ్ గదిని పరిశీలించాడు. లాయర్ నోటీసు ఒకటి కన్పించింది. అది విడాకుల కోసం క్రితం రోజు సింగ్ కోర్టుకు సమర్పించిన వినతి పత్రం. అందులో తన భార్య తనతో సఖ్యతగా ఉండదనీ, చాలా అసభ్యంగా మాటాడుతుందనీ, చాలా క్రూరంగా ప్రవర్తిస్తుందని, అందువల్ల విడాకులు మంజూరు చెయ్యవలసిందిగా కోర్టు వారిని కోరుతున్నట్టుగా రాసి ఉన్నది. అది చదివి ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్య పోయాడు. అక్కడ వున్న అతని మిత్రులూ, తోటి ఆఫీసర్లకు కూడా ఈవార్త ఆశ్చర్యాన్ని కలిగించింది. భార్యా భర్తల మధ్య మనస్పర్థలు ఉన్నట్టుకూడా ఎవరికీ తెలియదు. పైగా మిత్రుల ముందు తన భార్యను ఎంతో గౌరవించేవాడు. ఆమెను ఎంతో పొగిడేవాడు సింగ్.

జూన్ 11న కెప్టెన్ సింగ్ కుటుంబ సభ్యులు డెహరాడూన్ వచ్చారు. రాగిణి కూడా తన తండ్రిని పిలిపించింది. రాగిణి తండ్రి పోలీస్ ఇనస్పెక్టర్‌గా పని చేసి రిటైర్ అయ్యాడు. సింగ్ అన్నకొడుకు సుభాష్ చంద్రబోస్. బాబాయి దగ్గర డెహరాడూన్‌లో వుండి ఇంటర్ చదువుతున్నాడు. నెల క్రితం వేసవి సెలవలకు తన ఇంటికి అంటే దేవరియా అనే గ్రామం వెళ్ళాడు. బాబాయి హత్య గురించి విని అతను కూడా తండ్రితో పాటు డెహరాడూన్ వచ్చాడు. పోలీసు ఇన్‌స్పెక్టర్ యాదవ్ సుభాస్ స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నాడు.

"మా బాబాయితో పిన్ని ఎప్పుడూ పోట్లాడుతూనే వుండేది. నేను ఇక్కడ వుండి చదవడం కూడా ఆమెకు ఇష్టం వుండేది కాదు. ఒకరోజు మా బాబాయి మీద ఖాళీ బీరుసీసా విసిరికొట్టింది. అదృష్ట వశాత్తు అది అయనకు తగలలేదు. ఇద్దరూ వేరు వేరు గదుల్లో పడుకునే వారు. మా బాబాయి బయటివాళ్ల దగ్గిర చాలా జాగ్రత్తగా వుండేవాడు. అంతేకాదు, ఇంటికి వచ్చిన వాళ్ళముందు మా పిన్నిని ఒకటే పొగిడే వాడు." అంటూ సుభాన్ ఇంకా ఎన్నో విషయాలు చెప్పాడు.

కెప్టెన్‌కు తన భార్యలో మార్పు వస్తుందనే ఆశ వుండేది. వాళ్లిద్దరిదీ ప్రేమ వివాహం అని తెలిసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్య పోయారు. ఎస్. ఎన్. సింగ్ పూర్తి పేరు స్వామినాధ సింగ్. అతను అలహాబాద్ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు రాగిణితో పరిచయం అయింది. రాగిణి కలిగిన కుటుంబానికి చెందిన యువతి. సింగ్ బీద కుటుంబంలోనుంచి వచ్చినవాడు. రాగిణి వివాహానికి తొందర పెట్టినా సింగ్ తొందర పడలేదు. అతనికి మిలటరీ ఉద్యోగం వచ్చాకనే వివాహానికి అంగీకరించాడు. వివాహం జరిగింది. అత్తగారి ఇంటికి వచ్చిన రాగిణికి ఆ ఇంటి పరిస్థితి నిరుత్సాహాన్ని కలిగించింది. ఆ కుటుంబ సభ్యులంటే చిన్నచూపు ఏర్పడింది. అయినా భార్యాభర్తలు బాగానే ఉండేవారు. ఉద్యోగరీత్యా ఫామిలీని తీసుకువెళ్లడానికి వీలు లేని చోట పనిచేసే సమయాల్లో, సింగ్ భార్యను తన తల్లిదండ్రుల దగ్గర ఉండవలసిందిగా కోరేవాడు. కాని ఆమె తన పుట్టింటికి వెళ్ళి పోయేది. డెహరాడూన్ వచ్చాక, రాగిణి భర్త దగ్గరకు వచ్చింది. తమ ఏకైక పుత్రికను ఆమె తన తల్లి దగ్గర వదిలెయ్యడం సింగ్‌కు బాధ కలిగించింది. ఆ పిల్లకు మూడు సంవత్సరాలు. సింగుకు పిల్లలంటే ఇష్టం. అతన్ని బాధ పెట్టాలనే ఉద్దేశ్యంతోనే కూతుర్ని తల్లి దగ్గర వుంచింది

రాగిణి. ఆమెకు మళ్ళీ గర్భం వచ్చింది. సింగు ఆనందానికి అంతులేదు. సింగ్ క్యాంప్ వెళ్ళినప్పుడు రాగిణి ఒక ప్రైవేట్ డాక్టర్ దగ్గరకు వెళ్లి గర్భస్రావం చేయించుకున్నది. ఈ విషయాలన్నీ విడాకులకు పెట్టుకున్న అర్జీలో రాయడం జరిగింది. అతను లక్షరూపాయల ఇన్‌ష్యూరెన్సును భార్యను వారసురాలిగా నామినేట్ చేశాడు. అది తెలుసుకున్న రాగిణి ప్రవర్తన మారలేదు. పైగా భర్తను మరీ చిన్న/చూపు చూడసాగింది.

రాగిణికి విలాసాలంటే ఇష్టం. ఆమెకు డబ్బు కావాలి. పెద్ద హెూదా కావాలి. భర్త అంటే చిన్న చూపు ఏర్పడింది. అతను చస్తే తనకు లక్ష రూపాయలు వస్తాయనే దురాశ కూడా ఏర్పడింది. మనసు బాగాలేక ఆరాత్రి క్లబ్బులో చిత్తుగా తాగి ఇంటికి వచ్చాడు సింగ్. వళ్ళు తెలియకుండా నిద్రపోతున్న భర్తను రాగిణి పదునైన కత్తితో గొంతుమీద అనేకసార్లు పొడిచింది. రక్తపు మరకలున్న నైట్ గౌను పోలీసులకు దొరికింది. భర్తను చంపి, దుస్తులు మార్చుకుని, తనను తానే కిటికీ చువ్వలకు కట్టేసుకున్నది. ఆమె ఖరీదైన నగలు అంతకు కొద్ది వారాలముందే పుట్టింటికి చేర్చింది. విడాకులు మంజూరైతే ఇన్‌ష్యూర్ చేసిన లక్ష రూపాయలూ, ఫామిలీ ఫండూ తనకురాదని ఆమెకు తెలుసు. ఆమెను అరెస్ట్ చేశారు. తండ్రి జామీన్ కోసం ప్రయత్నించాడు. క్రింది కోర్టు తిరస్కరించింది. హైకోర్టు కూడా తిరస్కరించింది. మళ్ళీ బెంచికి అప్పీల్ చేశాడు రాగిణి తండ్రి. హైకోర్టు బెంచి జామీన్ మంజూరు చేసింది. ప్రస్తుతం రాగిణి తండ్రి దగ్గర వున్నది.

డెహరాడూన్ కోర్టులో కేసు నడుస్తున్నది.